కెరటం
( సామాన్యుడి ఆయుధం ) న్యూస్
సోమవారం 25, మార్చి 2024 తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన మీడియా సంస్థ

# ఆదివాసీల అస్తిత్వం



ఈ దేశ మూలవాసులే ఆదివాసీలు అనే నానుడి ప్రాచీన కాలం నుండి నేటితరం వరకు వినిపిస్తున్న పదం. కానీ నేడు ఆ పదం కుట్రపూరిత ప్రభుత్వ విధానాల వలన అంతరించే దశకు చేరుతుంది అనడంలో అతిశయోక్తి లేదు. ఆదివాసీల నాగరిత వేద పురాణాలల్లో పేర్కొన్న అతి పురాతనమైనదిగా చెప్పబడుతుంది. ఆదివాసీల మనుగడ పచ్చని దట్టమైన అరణ్యవనంలోని నది పరీవాహక ప్రాంతాలకు ఆనుకోని స్థిర నివాసాలు ఏర్పరుచుకొని, బాహ్య సమాజంతో ఎటువంటి సంభందం లేకుండా జీవించే విలాసవంతమైన స్వేచ్ఛ జీవితం వారిది. బయటి సమాజంతో పోలిస్తే బౌగోళికంగా వారి యొక్క సంస్కృతి - సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు,పండుగలు, వివాహా వేడుకలు చాలా వేరుగా ఉంటాయి. ప్రకృతితో మమేకమై గుడి గోపురం లేని ప్రకృతి ఆరాధికులు. ప్రాచీన కాలం నుండి కేవలం ప్రకృతిని ప్రేమిస్తూ పంచభూతాలనే తమ దైవలుగా భవిస్తూ, ఎటువంటి ఆకారం లేని రాయి, చెట్టు, పుట్టలను దైవ స్వరూపులుగ కొలిచే ప్రక్రియ తరతరాలుగా ఆనవాయితీగా వస్తున్న ఆచారం వారిది. వారికంటూ ప్రత్యేక భాష, యాస,కట్టుబాట్లు ఉన్నప్పటికి సమాజంలో సాంకేతిక పరిజ్ఞానం విస్తృస్తున్న తరుణంలో భయటి సమాజనికి అధర్శప్రాయంగా ఉన్న ఆదివాసీల జీవన గమనం నేడు అంతరించే దశకు చేరి, హిందు భావజాలం వైపు మళ్లింది.

సామాజికంగా, ఆర్థికంగా మారుతున్న కాలానుగుణంగా వారి యొక్క సాంస్కృతి సంప్రదాయాలతో పాటు ఆహారపు అలవాట్లు కూడా క్రమక్రమంగా తగ్గిపోతున్నాయి. అదే కాకుండా తమ అమాయకత్వంతో ఇతర మతాల సంప్రదాయ పద్దతులకు ఎక్కువగా ఆకర్షితులవుతూ ఆదివాసీల జీవన విధానాన్ని విస్మరించే స్థాయికి చేరువవయ్యారు అనడంలో చెప్పకనేచెప్పవచ్చు. ఆదివాసీల అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకొని ఒక ప్రక్క ప్రభుత్వాలు అభివృద్ధి పేరుతో భాహుళర్ధక ప్రాజెక్టులు,



టైగర్ జోన్ ల పేరుతో నిర్వాసితులను చేసి, రాష్ట్ర, జిల్లా,మండలాల విభజన పేరుతో ఎక్కడిక్కడ ప్రాంతాలుగా విభజించి వారి ఐక్యతను దెబ్బతీయడమే కాకుండా మరో పక్క వలసవాదాన్ని ప్రత్సహిస్తూ విచ్చలవిడిగా తమ అనుకూల గిరిజనేతర పార్టీల బినామీలను ఏర్పాటు చేసి, ఆధిపత్యం చెలయిస్తూ, అనునిత్యం తమ కభంధ హస్తలతో ఆదివాసీల మధ్య తగాధలను సృష్టించి వర్గాలుగా విభజించారు.

తద్వారా అక్రమ వలసలు,కేసులు, బినామీ వ్యవస్థ, వడ్డీ వ్యాపారం, ఖనిజ సంపద దోపిడి, ఆస్తులు పరాయీకరణ వంటి దాష్టీకాలు జరుగుతున్నా ప్రభుత్వ యంత్రాంగం తూతుమంత్రంగా ఏమిపట్టనట్లుగా వ్యవహరిస్తూ గిరిజన ప్రాంతంలో ఆదివాసీలు స్వేచ్ఛగా బ్రతికే పరిస్తితి లేదు. సమృద్ధిగా ఉన్నఖనిజ సంపదను, వనరులను కాంట్రాకుల చేతుల్లో పెట్టి స్థానిక గిరిజనులకి అందాల్సిన ఆదాయాన్ని పరులపాలు చేస్తున్నాయి. ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జతరగా పిలవబడుచున్న వన దేవతలు సమ్మక్క సారలమ్మ జాతర పరాయీకరణ అయి హైందవ పూజా విధానానికి అతి చేరువలో ఉంది. ఆదివాసీల కోసం బ్రిటిష్ ప్రభుత్వం కూడా పరిపాలన నిమిత్తం ప్రత్యేక చట్టాలను, హక్కులను రూపొందించాయి. భారత స్వతంత్ర్యం అనంతరం భారత రాజ్యాంగంలో అధికరణ 244 ప్రకారం 5వ షెడ్యూల్డ్ ను ఏర్పాటు చేసి రాజ్యాంగం లో మరో రాజ్యాంగంగా పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంత వడ్డీ వ్యాపారం నిషేధిత నిభంధనలు -1960, పీసా చట్టం-1996, భూ బలాయింపు నిరోధక సవరణ చట్టం-1970 మరియు ఆర్ఓఎఫ్ఆర్-2006 వంటి అనేక చట్టాలు అమలులో ఉన్నాయి. ఆ షెడ్యూల్డ్ ప్రాంతాలను పరిపాలించుటకు ఏజెంట్ గా ఐఏఎస్ అధికారులను నియమించుట వలన వాటినే ఏజెన్సీ గ్రామాలుగా పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతాలకు ప్రత్యేక అధికారాలు, చట్టాలు, హక్కులు మరియు పరిపాలనకై సమీకృత గిరిజానాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) లను ఏర్పాటు చేయడం జరిగింది.ఏజెన్సీ ప్రాంతాలలో రాజకీయ పార్టీలు చొచ్చుకొని సమాజంలో తమ ఉనికిని చాటుటకు ఆదివాసీలను కేవలం ఓటు బ్యాంక్ గానే చూస్తున్నాయి తప్ప వారి అభివృద్ధిని పట్టించుకునే దాఖలాలు లేవు. భారతదేశానికి స్వతంత్రం వచ్చి 7 దశాబ్ధాలు దాటినప్పటికి ఇప్పటికీ సరైన రోడ్లు, నీటి సదుపాయం లేని గ్రామాలు గ్రామాలు ఎన్నో ఉన్నాయి. ఇప్పటికీ మారుమూల ప్రాంతలో సరైన విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందక విలమటిస్తున్నారు. అభివృద్ధి చెందుతున్న సమాజంలో ఏజెన్సీ ప్రాంతంలో సుస్థిరమైన సుపరిపాలన మరియు తమ అష్తిత్వాన్నికాపాడాలంటే గిరిజన యువత ఉన్నత విద్యవంతులై తమ చట్టాలను, హక్కులను గుర్తెరిగి అమలు చేయించాలి. భావితరల వారికి తమ హక్కులను తెలియజేస్తూ అభివృద్ధి పథంలో ముందడుగు వేయాలి. సమాజంలో వారి ఉనికి, అస్థిత్వాన్ని కాపాడే విధంగా ప్రభుత్వాలు కృషి చేయాలి.

**ఎస్. లలిత**
**పరిశోధన విధ్యార్థి**
**శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు**
**విశ్వవిద్యాలయం, బాచుపల్లి,హైదరాబాద్**